నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | జనవరి 29, 2024 | www.navatelangana.com

ఇసుక లారీల తనిఖీ



ఇసుక లారీలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి

టిఎస్ఎండీసీ అధ్వర్యంలో కామారెడ్డి పట్టణం నేషనల్ హైవే రోడ్డు వద్ద టిఎస్ఎండీసీ కామారెడ్డి ఏడి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం ఇసుక లారీలను తనిఖీ చేశారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో ఎటువంటి ఇసుక రీచులు నడవడం లేదనీ, ఇతర జిల్లాల నుండి కామారెడ్డి పట్టణానికి వచ్చే ఇసుక లారీల వేబిల్లు పత్రాలను, తూకం వేసే కేంద్రాలను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా ఇసుక రవాణా చేయాలని నిర్వహకులకు తెలియజేసారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడి క్రాంతికుమార్ ఇసుక లారీల నిర్వాహకులను హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పంచనామా చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-దోమకొండ

అప్పులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని ముత్యంపేట్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొబ్బిలి దుర్గయ్య (53) తన వ్యవసాయ భూమిలో మూడు బోర్‌లు వేయగా నీళ్ళు పడలేవు. బోర్‌లు వేయడం కోసం అప్పులు కావడంతో వాటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక తన వ్యవసాయం భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుతున్నామని తెలిపారు.

వెంచర్‌లో 'పకృతివనం'

- మంజూరు ఒక వార్డులో.. వనం మరో వార్డులో
- ప్రభుత్వ నిధులతో ప్రయివేటులో పనులు
- చక్రం తిప్పిన ఓ నాయకుడు
- వత్తాసు పలికిన మున్సిపల్ అధికారులు



12వ వార్డులోని వెంచర్‌లో ఇంటి నిర్మాణాలు



వెంచర్‌లో ఏర్పాటు చేసిన పకృతివనం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పకృతి వనాలు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ నిధులతో, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాల్సిన పకృతి వనాన్ని.. నాయకులు, అధికారుల కుమ్మక్కుతో ప్రయివేటు వెంచర్‌లో ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రభుత్వ నిధులు రూ.15 లక్షలు వెచ్చించి ప్రయివేటు స్థలంలో ఏర్పాటు చేయడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది. 35వ వార్డులో ఏర్పాటు చేయాల్సిన వనాన్ని ఏకంగా 12వ వార్డుకు తరలించి మరి వెంచర్‌లో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది. వివరాల్లోకి వెళ్తే..

గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వార్డులో ప్రకతి వనాన్ని ఏర్పాటు చేయాలని అందులో ఆ వార్డులోని యువకులు, పెద్దలు, పిల్లలు ఉదయం, సాయంత్రం సందర్శిస్తారనే ఉద్దేశంతో ఈ ప్రకతి వనాలను ఏర్పాటు చేసింది. అయితే కొందరు రాజకీయ నాయకులు దీనిని వారి స్వలాభం కోసం వాడుకుంటున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి మున్సిపల్‌లో 12వ వార్డ్‌లో కాసర్ల విహార్ 2లో వార్డు నెంబర్ 35 ప్రకతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఇది నూతనంగా ఏర్పాటు చేస్తున్న కాసర్ల వెంచర్-2 లోనిది. ఇంకా భవనాలు కట్టడాలే పూర్తి కాలేదు, ప్రజలు ఎవరు ఇక్కడ నివాసం ఉండడం లేదు. రాజకీయ నాయకుల స్వలాభం కోసం ఈ నూతన వెంచర్‌లో ప్రకతి వనాన్ని ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

35 వార్డులో మున్సిపల్‌కు చెందిన ఖాళీ స్థలాలు చాలానే ఉన్నాయని ఎక్కడైనా ప్రకతి వనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్న ఆ వార్డులో ప్రకతి వనం ఏర్పాటు చేయడం లేదు. 35 వార్డులో ఓ రాజకీయ నాయకుడు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే స్థానికులు ఎదురు తిరిగి దానిని మాన్పించారని ఆ కాలనీవాసులు పేర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు కాంట్రాక్టర్లకు వివిధ పనులకు బిల్లులు చెల్లించే ముందు ఎక్కడ ఉంది, ఎలా ఉంది ఎలా ఏర్పాటు చేశారని తనిఖీలు లేకుండా అన్ని బిల్లులు ఎలా చెల్లించారో మున్సిపల్ అధికారులకు తెలియాలి.

ఇది ఒకటేనా ఇంకా ఉన్నాయా?

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఈ ఒక్క ప్రకతి వనం విషయం బయటకు వచ్చింది. ఇలానే ఈ ప్రకతి వనం మాదిరిగా ఇది ఒకటే ఉందా ఇంకా చాలా ఉన్నాయా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ ప్రభుత్వంలోనైనా అక్రమాలు జరగకుండా ఆగుతాయా?

ఈ ప్రభుత్వంలోనైనా అధికారులు ఇలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తెస్తే వారికి సహకరించకుండా ప్రజల పక్షాన నిలబడాలని మున్సిపల్ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

16న దేశవ్యాప్త సమ్మె

- జయప్రదం చేయండి : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

నవతెలంగాణ-మద్నూర్

వచ్చే నెల ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన ఏజెన్సి కార్మికులు ఇతర రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం మద్నూర్ మండలం మెనూర్‌లో డోంగ్లి, మద్నూర్ మండలాలకు చెందిన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన ఏజెన్సి కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసనగా చేపట్టే సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అర్. అనసూయ, సచిత, సుజాత, ప్రేమల, శారద, సరస్వతి, సుమన్ బాయి, శాంతి, సాయిలు,లక్ష్మి,రుప్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

తొలివేతనం
కార్యకర్త ఇంటి నిర్మాణానికి విరాళం

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఔదార్యం



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-గాంధారి

తన మొదటి జీతం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇంటి నిర్మాణం కోసం కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. గాంధారి మండలంలోని సర్వాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రభుత్వ నుండి వచ్చే వేతనం పేద వారి సంక్షేమం కోసం ఖర్చుచేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంకట్ కుటుంబానికి మొదటి నెల జీతంతో వారికి ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం ఎమ్మెల్యే తన వేతనం అందజేస్తానని ప్రకటించడంతో స్థానికులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గాంధారి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాడ్వాయి సంతోష్ మాతృమూర్తి ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వివిధ మండలాల నాయకులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో
రాణించడం అభినందనీయం

- జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా జడ్జి

జిల్లా మహిళా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని జిల్లా జడ్జ్ సునీత కుంచాల అన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ఉమెన్స్ కాలేజ్ మైదానంలో అండర్ 13 కేలో ఇండియా బాలికల టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాల విచ్చేసి ఉమెన్స్ కళాశాల ఎన్‌సిసి క్యాడేట్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి యెండల సౌందర్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య, బాక్సింగ్లో నిఖత్ జరీన్, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలవత్ పూర్ణలను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలతోపాటు చదువులో సైతం రాణించాలని కోరారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న మహిళా క్రీడాకారులు ఆత్మ రక్షణ కోసం జూడో కరాటే లాంటి క్రీడల్లో సైతం తర్ఫీదును పొందాలని తెలియజేశారు. అంతర్జాతీయ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కేర్ ఫుట్‌బాల్ అకాడమీ చైర్మన్ నరాల సుధాకర్, కోచ్ గొట్టిపాటి నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులనుదేశిస్తూ రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జి.ఫాల్గుణ మాట్లాడుతూ.. అంతర్జాతీయ బ్రెజిల్ ఫుట్‌బాల్ లీగ్‌లో ఉమ్మడి రాష్ట్రాలలో మొదటి మహిళా క్రీడాకారినిగా గూగుల్ సౌమ్య ఆడుతుందని కొనియాడారు. అంతర్జాతీయ ఐడల్ ఫుట్‌బాల్ టోర్నీలలో తెలంగాణ నుండి 9 మంది క్రీడాకారులు ఆడడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ ఫుట్బాల్ కార్యదర్శిగా తలెత్తుకు తిరుగుతున్న అంటే మహిళా క్రీడాకారులే అని ప్రశంసించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షులు మంతెన రాజేందర్ రెడ్డి, డాక్టర్ కవిత రెడ్డి మాట్లాడుతూ.. ఖేలో ఇండియా క్రీడా పోర్టులను జిల్లాలో నిర్వహించడం గర్వకారణమని కేలో ఇండియా తరపున అండర్-13, అండర్-15, అండర్ -17 క్రీడాకారులను ఎంపిక చేసి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. కేలో ఇండియా అండర్-13 టోర్నీ విజేతగా డెక్కన్ డైనమస్ జట్టు, రనారప్ జట్టుగా జిల్లా కేర్ ఫుట్బాల్ అకాడమీలు నిలిచాయి. విజేత జట్టుకు రూ. 30,000 వేల నగదు రన్నర్ అఫ్ జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీ మెడల్స్‌లను ముఖ్యఅతిథి జిల్లా సునీత కుంచాల చేతుల మీదుగా అందజేశారు.

టోర్నీ బెస్ట్‌గోల్ కీపర్‌గా అక్షర ఫుట్‌బాల్ క్లబ్, బెస్ట్ డిఫెండర్ ఇషిత హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్, రోహిత రెడ్డి బెస్ట్ మీడ్ ఫీల్డర్ డెక్కన్ డైనమస్, ఎమర్జింగ్ ప్లేయర్స్‌గా కీర్తన, ఫాతిమాలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఫరూఖ్, జావిద్, ఫుట్‌బాల్ అకాడమీ జాయింట్ సెక్రెటరీ కేకే రెడ్డి, ఫరూక్, మహిళా కళాశాల సెక్రెటరీ పద్మనాభరెడ్డి, మహిళా కళాశాల మేనేజ్మెంట్ సభ్యులు మహేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ భారతీరెడ్డి, వివిధ అకాడమీలా కోచ్లు హరి, విజయ్, ఆదర్శ్, వినోద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమనిషీ ఒక పుస్తకమే

- సెల్ఫీ పుస్తక ఆవిష్కరణ సభలో జేవీవీ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్

నవతెలంగాణ-వర్ని



సెల్ఫీ పుస్తకం ఆవిష్కరిస్తున్న పలువురు

చదవాలే కానీ ప్రతి మనిషీ ఒక పుస్తకమేనని , సమాజం పట్ల నిరంతరం ఆలోచన చేసి, ఒక జ్ఞాన సమాజాన్ని నిర్మించా లనే కృషిలో భాగస్వాములైన ప్రసాదరావు రాసిన సెల్ఫీ పుస్తకం ప్రగతిశీలంగా ఆలోచి ంచే వారందరూ చదవదగినదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు చెలిమేల రాజేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలో సత్యనారాయణ పురం గ్రామ కమిటీ హాల్ లో సెల్ఫీ పుస్తక పరిచయ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు విచ్చేసిన పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక దురాచారాల మీద, మూఢనమ్మకాల మీద ప్రసాదరావు చేసిన పోరాటాలు గొప్పవని కొనియాడారు. జిల్లా లో జన విజ్ఞాన వేదిక కు అధ్యక్షులు గా కొనసాగి సమాజం మార్పు కోసం చెకుముకి బుక్‌లను పంపిణీ చేశారని గుర్తు చేశారు. తన జీవితంలో జరిగిన తప్పులు, ఒప్పులు కూడా పుస్తకం లో రాయటం తన నైజం అని అన్నారు. ఈ పుస్తకాన్ని నవతెలంగాణ పత్రిక వ్యవస్థాపకులు ఒప్పందంతో ముద్రిరించారని అందుకు నవతెలంగాణ పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి , జేవీవీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్లు, సంస్కార్ పకృతి ఆశ్రమ నిర్వహకుడు మార్ని రామక్రిష్ణరావు, పుస్తక సంపాదకులు వరప్రసాద్ రావు, లింగం , రాజు, రెడ్డి రాంబాబు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే షకిల్ కుమారుడి ఘటనలో
మాజీ పట్టణ సీఐ అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కుమారుడు రాహిల్ గత కొన్ని రోజుల క్రితం ప్రగతి భవన్ సమీపంలో భారీకేట్లను నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢీ కొట్టిన ఘటనలో బోధన్ మాజీ సిఐ ప్రేమ్ కుమార్ ను, మాజీ ఎమ్మెల్యే షకీల్ ప్రధాన అనుచరుడిని ఉన్నతాధికారులు అరెస్టు చేసినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే కుమారుడు రాహుల్ ప్రమాదానికి కారణం కావడంతోపాటు విదేశాలకు పారిపోవడానికి షకిల్ అనుచరుడు అలాగే పట్టణ మాజీ సీఐ ప్రేమ్ కుమార్ సహకరించినట్లు తేలడంతో వారిని అరెస్టు చేసినట్లు సమాచారం.

వికలాంగునికి ఇంటిని నిర్మించిన మాజీ విప్

- అట్టహాసంగా గృహప్రవేశం చేయించిన గంపగోవర్ధన్



గృహప్రవేశం చేయిస్తున్న మాజీ విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

మాజీ విప్ గంప గోవర్ధన్ తన సొంత డబ్బులు 10 లక్షల రూపాయలతో పాత రాజంపేట గ్రామంలో నిరుపేద వికలాంగుడైన షేక్ ఖాదర్ కు కొత్త ఇల్లు కట్టించి ఇచ్చి ఆదివారం గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6 వ వార్డు కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్, షేక్ ఖాదర్ చెల్లె గండుబి, మేనకోడలు అఫ్రిన్ బేగం మాట్లాడుతూ పాత రాజంపేట గ్రామంలోని రైల్వే గేట్ దగ్గర రోడ్డు పక్కన పూరి గుడిసె ఉండేదని,ఆ గుడిసెలో వర్షం పడినప్పుడల్లా నీళ్లు నిలిచి ఉండేవని, దాన్ని చూసి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కు బాధ కలిగి అతనికి తన సొంత డబ్బులు 10 లక్షలు రూపాయలతో ఇల్లు నిర్మించి నూతన గృహప్రవేశం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించినట్టుతెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు ముజీబోద్దీన్ , ఎంపిపి పిప్పిరి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకట్, ఉపాధ్యక్షులు కుంభాల రవి,కౌన్సిలర్స్ హఫీజ్, సలీం లడ్డు, నాయకులు గోపి గౌడ్, గైని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రామ గౌడ్, సర్పంచులు జ్ఞానేశ్వర్, రవితేజ గౌడ్, రవి ,ఎంపీటీసీలు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

14 ఏండ్లయినా సమస్య తీరలే

- పోడు భూమిలో సాగుకు తప్పని నిరీక్షణ
- హైకోర్టు క్లియరెన్స్ ఇచ్చినా అడ్డుకుంటున్న అటవీశాఖ

నవతెలంగాణ-సిరికొండ



సిరికొండలోని 532సర్వే నెంబర్‌లోని పోడుభూమి

పోడు భూమిలో సాగుకు హై కోర్టు క్లియరెన్స్ ఇచ్చినా.. ఆఖరికి రెవెన్యూ అధికారులు సైతం ఆ భూమి రెవెన్యూది అని నిర్ధారించినా అటవీ శాఖాధికారులు అనేక అడ్డంకులు సృష్టిస్తూ సాగుచేసుకోకుండా అడ్డుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. 14 ఏండ్లుగా తమ గోడును ఎవరూ తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

సిరికొండ మండల కేంద్రంలోని 532 సర్వే నెంబర్‌లో 166 మంది లబ్ధిదారులకు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం పోడు పట్టాలు ఇచ్చింది. అయితే అది ఫారెస్టు భూమి అని ఫారెస్టు అధికారులు సాగు చేయనీయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో రైతులు 2012లో హైకోర్టును ఆశ్రయించారు. రైతులు భూమిని సాగు చేసుకోవచ్చని హై కోర్టు తీర్పునిచ్చింది. అయినా ఫారెస్టు అధికారులు కోర్టు తీర్పును సైతం లెక్కచేయకుండా అడ్డుకుంటున్నారు. 2009 నుంచి 2015 వరకు ఫారెస్టు, రెవెన్యూ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో 10 సార్లు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సదరు భూమి రెవెన్యూదని తేలింది.

14 ఏండ్లయినా సమస్య తీర్చలే

హైకోర్టు తీర్పు ఇచ్చినా, భూమి రెవెన్యూదని తేలినా ఇప్పటికీ రైతులను అడ్డుకుంటుండటం గమనార్హం. భూమి కోసం 14 ఏండ్లుగా తాము ఎదురు చూస్తూనే ఉన్నట్టు లబ్ధిదారులు వాపోతున్నారు. రైతులకు నేటి వరకు డిజిటల్ పట్టాలు ఇవ్వలేదు. జాయింట్ సర్వేలు నిర్వహించినా రైతుల సమస్యలు మాత్రం పరిష్కరించలేదు.

సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలోని 100, 102 సర్వే నంబర్‌లో 195 ఎకరాలు, మైలారం శివారులోని 128 సర్వే నంబర్‌లో 50 ఎకరాలు, కొండాపూర్ గ్రామంలోని 135 సర్వే నంబర్‌లో రైతుల సమస్య సమస్యగానే మిగిలింది. 2006లో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ డెవలప్ మెంట్ స్కీంలో భాగంగా సాగు చేసుకోవడానికి నిధులను ఇచ్చింది. స్కీంలో వచ్చిన నిదులతో రైతులు భూమి సాగు చేసుకొని బోర్లు సైతం వేసుకున్నారు. అప్పటి నుంచి నేటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పింది. దీంతో చాల మంది రైతుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ధరఖాస్తు చేసుకున్న కొంత మందికి మాత్రమే గత ప్రభుత్వం డిజిటల్ పట్టాలు ఇచ్చి చేతులు విదిల్చింది. తమకు పట్టాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తీర్చి డిజిటల్ పట్టాలు ఇవ్వాలని రైతులు కోరుతురన్నారు.

డిజిటల్ పట్టాలివ్వాలి



దీపక్. లబ్ధిదారుడు. సిరికొండ

సిరికొండ మండలం కేంద్రంలోని 532 సర్వే నెంబర్‌లో ఎకరం సాగు చేసుకొమ్మని 2009లో అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఫారెస్టు ఆఫిసర్లు ఆ సర్వే నబంర్ ఫారెస్టులో ఉందంటు సాగు చేయ్యనివ్వడం లేదు. ప్రభుత్వం డిజిటల్ పట్టాలు ఇవ్వాలి.

పోడు పట్టాలు ఇచ్చినా సాగుకు అడ్డంకులు



పిట్ల రామకృష్ణ ,ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి

అప్పటి ప్రభుత్వం రెవెన్యూ ఆఫిసర్ల సమక్షంలో రైతులకు పట్టాలు, నిధులను ఇచ్చింది. ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలు పనికిరావంటు ఫారెస్టు ఆఫిసర్లు సాగును అడ్డుకోవడం సరికాదు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు డిజిటల్ పట్టాలు ఇచ్చి సాగు చేసుకునే విధంగా చూడాలి.

నా పరువుకు భంగం కల్పించారు

• పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి గంగదాస్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి తన పరువుకు భంగం కలిగించాడని ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలువేరి గంగదాస్ తన ఫేస్ బుక్ అకౌంట్‌లో వీడియో పెట్టి 'మహిళను తన్నినవాడికి కండువా కప్పిన 'పేవంత్' అని పోస్టు చేశాడని, ఆ వీడియోలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో నేను దిగిన ఫోటోను పెట్టాడని తెలిపారు. ఈ పోస్ట్‌తో రెండువర్గాల మధ్య గొడవలు జరిగే విధంగా ఉన్నాయని ఇమ్మడి గోపి పేర్కొన్నారు. దీనికి కారణమైన చిలివేరి గంగదాసుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఇమ్మడి గోపి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాగేపల్లి జీపీ పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని బాగేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ పాముల సాయిలుతో పాటు, కార్యవర్గ సభ్యులను ఆదివారం ఘనంగా సన్మానించినట్టు గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో వారికి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించినట్టు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, కార్యదర్శి శ్రీకాంత్, కారోబార్ మహేష్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మీసేవ కార్యవరం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-నందిపేట్

ఉమ్మడి నందిపేట్ మండల మీసేవ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గొజ్జి మహేష్, ఉపాధ్యక్షులుగా సమరపు సతీష్, ప్రధాన కార్యదర్శిగా వుటుర్ సంతోష్, కోశాధికారిగా సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ మీ సేవల ద్వారా మరిన్ని సేవలను అందిస్తామని గొజ్జి మహేష్ తెలిపారు. సమావేశంలో ఉమ్మడి నందిపేట్ మండల మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో ఉపాధి కల్పించాలి

నవతెలంగాణ-కోటగిరి



మాట్లాడుతున్న మండల కన్వీనర్

గ్రామాల్లో పల్లె ప్రకృతి వనంలో వికలాంగులకు ఉపాధి కల్పించి, నెలకు రూ.15వేలు ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డి) కోటగిరి మండల కన్వీనర్ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు ఉపాధి లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోనే సదరం క్యాంపు పెట్టి, వికలాంగులు ఇబ్బంది పడకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొండబాయి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భేటిబచావో భేటి పడావోలో ప్రథమస్థానం

నవతెలంగాణ-ముప్కాల్



బహుమతి అందుకుంటున్న మహావిన్

భేటి బచావో-భేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో విద్యార్థిని అధిన మహావిన్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డ్ గ్రహీత అంగన్‌వాడీ టీచర్ అమీనా బేగం మనుమరాలు అధిన మహావిన్ 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారుల చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. అమ్మమ్మ అమిన బేగం ఇచ్చిన సూచనల ఆధారంగా జిల్లా స్థాయి భేటి బాచావో-భేటి పడావో ప్రోగ్రామ్‌లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు.

నేడు కలిగోట్‌కు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామానికి ఎమ్మెల్యే రానున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని కలిగోట్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వస్తున్నారని తెలియజేశారు.

వైద్యులు రమణాచారి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన ప్రముఖ ఎంబీబీఎస్ వైద్యులు రమణాచారి (85) శనివారం మృతిచెందారు. వైద్యునిగా పట్టణంతో పాటు అనేక గ్రామాలకు ఈయన సుపరిచితులు. ఆయన అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొని రమణాచారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన రాజారపు నరేందర్ కుమారుడు రాజారపు రాజు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం సందర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక బాలయోగి శ్రీ రాములు మహారాజు పండరీపూర్ బయలుదేరి వెళుతూ మార్గమధ్యంలో తుల్జాపూర్ భవాని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ గణేష్ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మొట్టమొదటిసారిగా పిరమిడ్ ధ్యాన మందిరాన్ని సందర్శించిన శ్రీ బాలయోగి రాములు మహారాజును చంద్రశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పిఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, ఆశ్రమ సభ్యులు జనార్దన్ రెడ్డి, సంజీవ్, నర్సయ్య, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-ముప్కాల్

ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాదాత ఏనుగు దయానందరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 30న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కె.గంగాధర్ తెలిపారు. అండర్-17 బాలబాలికలకు ఈ పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విజ్ఞాన విహారయాత్రలో మిసిమి విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా ఆదివారం పలు ప్రదేశాలను సందర్శించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. ఉప్పల్ స్టేడియం, బద్రీనాథ్ టెంపుల్, సంఘీ టెంపుల్, యాదగిరిగుట్ట, సిద్ధిపేట కోమటి చెరువుతోపాటు పలు ప్రదేశాలను సందర్శించినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేకాధికారుల పాలనలో
అభివృద్ధి జరిగేనా..?



చేపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

• ఫిబ్రవరి 31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి కేంద్రం 1992లో రాజ్యాంగం సవరణ చేసి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు రాజ్యాంగ భద్రత కల్పించింది. ఏ విధంగానైనా పార్లమెంటు రాష్ట్ర శాసనసభకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతాయో అలాగే పంచాయతీలకు, మున్సిపాలిటీలకు కూడా వాటి పదవీకాలం ముగిసే ముందే ఎన్నికలు జరగాలి. కొత్త పాలకవర్గం పాత వారి పదవీకాలం ముగిసే నాటికి సిద్ధంగా ఉండాలి. 2019 సంవత్సరం జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగినవి. మరో మూడు రోజుల్లోగా జనవరి 31తో సర్పంచుల, వార్డ్ మెంబర్ల పదవీకాలం ముగుస్తుంది. రాజ్యాంగం అధికరణ 243 బీబీ1 ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీల అవసరాలను గుర్తించి వాటికి కావలసిన నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి విడుదల చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఈ నివేదికను రాష్ట్ర అసెంబ్లీ ముందించి చర్చించాలి. దానితో విషయాలు ప్రజలకు తెలుస్తాయి. కానీ గత పది సంవత్సరాలలో ఒక్కటంటే ఒక్క రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికను అసెంబ్లీ ముందు ఉంచటం గానీ ఆర్థిక సంఘం సూచించిన ప్రకారంగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం కానీ జరగలేదు.

రాష్ట్రంలో గ్రామపంచాయతీలు ఇప్పుడు స్వయంప్రతితో పాలన చేయలేదని తెలుస్తుంది. స్థానిక శాసనసభ్యుడు కనుసనల్లోనే నడిచినాయి. 2018వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని సవరించగా స్థానిక సంస్థలకు పదవీకాలం ముగియకముందే ఎన్నికలు నిర్వహించాలని, అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల తరహాలోనే పంచాయతీలకు ఇతర స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని నిబంధన ఉంది. ఈ చట్టం సెక్షన్ 37 ప్రకారం జిల్లా కలెక్టర్‌కు, సర్పంచులపై విస్తృత అధికారాలు ఇవ్వడం జరిగింది. కలెక్టర్ ఆదేశాలు సర్పంచ్ అమలు చేయకుండా అధికార దుర్వినియోగం వంటి సందర్భాలలో సర్పంచులు పదవి నుంచి తొలగించవచ్చు. కొన్ని సందర్భాలలో సర్పంచులు స్థానిక శాసనసభ్యునికి అనుకూలత కానప్పుడు శాసనసభ్యుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, దానిపై కలెక్టర్ సర్పంచి పదవి నుంచి తొలగించడం వంటివి జరగడంతో సర్పంచులలో ఒక భయానక వాతావరణం నెలకొంది.

గ్రామ పంచాయతీలపై పెనుభారం..

తమ గ్రామాలకు ఏమి అవసరం అన్నది గ్రామసభలో లేదా పంచాయతీలో నిర్ణయించాలి. కానీ ఇవేమీ జరగలేదు. ప్రతి గ్రామంలోనూ ఒక ట్రాక్టర్, ట్యాంకర్ వంటివి కొనాలన్నా రాష్ట్ర, జిల్లా, స్థాయి నుంచి ఆదేశాలు రావడంతో అవసరం ఉన్న లేకున్నా కొనడంతో గ్రామపంచాయతీలకు పెను భారమైంది. ఇతర పనులు తగినంత నిధులు లేకున్నా పనులు చేయాలని చెప్పడంతో వీధి లేక సర్పంచులు అప్పు.. సప్పు చేసి పనులు చేయించారు. నిధులు విడుదల లేక అప్పులు పెరిగిపోవడంతో చాలామంది సర్పంచులు ఇబ్బందుల పాలయ్యారు. మరికొన్నిచోట్ల ఆత్మహత్యలు సైతం చేసుకున్నారు.

మహిళ సాధికరతను తుంగలో తొక్కి..

అన్నింటిలో మహిళలే ముందంజ అంటూనే మహిళ సాధికారత ఆశయం సిద్ధించలేదు. పంచాయతీలలో 50శాతం సీట్లు మహిళలకు రిజర్వు అయ్యాయి. దానితో 50 శాతం సర్పంచులు మహిళలే కానీ అమలులో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మహిళ సర్పంచులు పక్కన పెట్టి ఆమె భర్త లేదా కొడుకు సర్పంచ్‌గా చెలామణి అయ్యారు. మండల స్థాయి అధికారులు స్థానిక శాసనసభ్యులు కూడా వారిని మీటింగ్‌లకు అనుమతించారు.

జిల్లాలో..

ప్రత్యేక అధికారులుగా వ్యవహరించే వివిధ హెూదాల్లో ఉన్న అధికారుల జాబితాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. గెజిటెడ్ అధికారులు సూపరిండెంట్, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఉద్యోగుల జాబితాను జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని జీపిల పాలన ప్రత్యేక అధికారుల చేతిల్లోకి వెళ్లనుంది. ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌కే ఇన్చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్న మెజారిటీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్‌కు చెందినవారు ఉండడంతో ప్రత్యేక అధికారుల ఎంపికనే మేలని భావిస్తూ జాబితాను సిద్ధం చేసుకుంది.

ప్రత్యేక పాలనలో అభివృద్ధి జరిగేనా..?

ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రస్తుత సర్పంచులకే పర్సన్ ఇన్చార్జిలుగా బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని పలువురు సర్పంచులు అంటున్నారు. గతంలో పనిచేసిన అనుభవం విధుల నిర్వహణకు పనికొస్తుందని క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని, ప్రత్యేక పాలనలో వచ్చేటటువంటి అధికారులకు గ్రామంపై పట్టు రావడానికి ఆయా సమస్యలు అంశాలపై అవగాహన ఏర్పడటానికి సమయం పడుతుందని, గతంలో చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉందని పలువురు సర్పంచులు తెలిపారు.

పంచాయతీల బాధ్యతల జాబితాను సిద్ధం చేశాం

ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామ పంచాయతీల బాధ్యతలను నిర్వర్తించే అధికారుల జాబితాను సిద్ధం చేశాం. మేజర్ పంచాయతీల బాధ్యత గెజిటెడ్ ఉద్యోగులకు, చిన్న పంచాయతీల బాధ్యత ఇతర క్యాడర్ ఉద్యోగులకు అప్పగించే అవకాశం ఉంది.
- జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిని.

చేతికొచ్చిన పొగాకు పంట

క్వింటాకు రూ.11,600 చెల్లిస్తున్న వివిధ కంపెనీలు.. రెంజల్‌లో భారీగా సాగుచేసిన రైతులు



చేతికొచ్చిన పంట



పొగ చూపించేందుకు పొగాకు మండెలను కట్టిన దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో పొగాకు పంట సాగుకు స్థానిక రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారు. అందులో భాగంగానే ఈ యేడు పంటను బాగానే సాగుచేశారు. గతంలో పొగాకు సాగుకు వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తారో వాటికి బాండ్ల రూపంలో కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీతో పాటు, టీపీపీ, ఐటీసీ కంపెనీలు పొగాకు కొనుగోళ్లకు ముందుకు రావడంతో ఈ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

బోధన్ మండలంలోని హంగర్గ, కొప్పర్గ గ్రామాలతో పాటు రెంజల్ మండలంలోని కందకుర్తి, పేపర్‌మిల్, నీలా, బోర్గం గ్రామాలలో రైతులు ఈ పంటను పండించారు. ఈ ఏడాది సుమారు రెంజల్ మండలంలో 2000 ఎకరాలలో ఈ పంటను సాగుచేశారు. పొగాకు నారును ఎకరానికి రూ.5000 చెల్లించి కొనుగోలు చేసి నాటారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో వివిధ కంపెనీల అధికారులు వచ్చి నాణ్యమైన పొగాకు ఏ గ్రేట్, మిగతా పొగాకుకు బి గ్రేడ్‌గా నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గత సంవత్సరం క్వింటాకు రూ.11,600 చొప్పున కొనుగోలు చేశారు. అయితే ప్రతి ఏటా మార్కెట్‌లో ధరను బట్టి రూ.500 నుంచి 1000 వరకు ధరను పెంచుతూ వారు కొనుగోలు చేస్తున్నారు.

ఎంత కష్టపడితే అంత లాభం



పొగాకు పంటను పండించడానికి రైతులు ఎంత కష్టపడితే అంతే లాభాలు కూడా వస్తాయి. పొగాకు పంట పండించిన తరువాత దానిని పొగాకుగా మార్చడానికి శ్రమ ఎక్కువగా ఉంటుంది.
- నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్ (రైతు కందకుర్తి)ఇ

అపూర్వ సమ్మేళనం



డిచ్‌పల్లి : మెంట్రాజ్‌పల్లిలో గురువులతో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/భీంగల్

మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని గ్రామంలోని రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు ఆనాడు చదువు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు కలిశారు. 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకరికొకరు కలుసుకుని ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుని యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బర్దిపూర్ సహకార సొసైటీ చైర్మన్ కొసరాజు రామకృష్ణ, ఉపాధ్యాయుడు జీ.చిన్నయ్య, లక్ష్మీనారాయణ, ఇక్రముల్లా, డిఆర్.మోహన్, నరసింహమూర్తి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ : 1995-96 సంవత్సరం పదవ తరగతి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణ కేంద్రంలోని లింబాద్రిగుట్టపై ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు కలుసుకొని పాత జ్ఞాపకాల నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. సుమారు 28 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులను కలుసుకొని పాత జ్ఞాపకాలను పంచుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆటపాటలతో వారు ఆనందంగా గడిపారు.



భీంగల్ : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



క్రీడాకారులను అభినందిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులను సునీల్ కుమార్ అభినందించారు. టోర్నమెంట్‌లో విజేతలుగా ఓపెన్ డబుల్స్ విభాగంలో నిజామాబాద్‌కు చెందిన రాఘవ-అర్షద్ ప్రథమ స్థానంలో నిలువగా, కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులు పెంట కిషన్-ఏలేటి మోహన్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. తృతీయ స్థానంలో బైంసాకు చెందిన నవీన్-విష్ణు తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. 40ప్లస్ డబుల్స్ విభాగంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులు పెంట కిషన్-ఏలేటి మోహన్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలువగా, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నవీన్- సాయి ద్వితీయస్థానంలో నిలిచారు.

ముప్కాల్‌కు చెందిన దినేష్- నవీన్ తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. వీరికి ముఖ్య అతిథిగా హాజరైన ముత్యాల సునీల్ కుమార్ బహుమతులను, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్, సలహాదారులు లుక్క గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తెడ్డు శేఖర్, కార్యదర్శిగా డిసి గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా టి.రాము, ఉపాధ్యక్షులుగా టి.నడపి గంగాధర్, ఉప కార్యదర్శిగా పి.అనిల్, కోశాధికారిగా బి.ఎర్రన్న, అటల కార్యదర్శిగా బి.వినోద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎం.సాయిలు, ప్రచార కార్యదర్శిగా టి.బార్రన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ హక్కుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

మానిక్‌బండార్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్‌బండార్ గ్రామాభివృద్ధి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సంపత్ వినోద్, కార్యదర్శిగా నర్సమొల్ల లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా ఎం.రాయ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా అర్జున్‌సింగ్, క్రిష్ణమోహన్, సంయుక్త కార్యదర్శిగా రాస అరుణ్, క్యాషియర్‌గా దమ్మాయి అనిల్‌ను ఎన్నుకున్నారు.

అనుమానస్పదస్థితిలో వృద్ధుడు మృతి

• హత్యచేసి ఉంటారనే అనుమానం

నవతెలంగాణ-మాక్లూర్



మైశయ్య (ఫైల్)

మండలంలోని మామిడిపల్లి గుట్ట ప్రాంతంలో అనుమానస్పదస్థితిలో వృద్ధుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన పల్లపు మైశయ్య (65) మేకలు మేపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు నలుగురు కొడుకులు, భార్య ఎల్లవ్వ ఉన్నారు. అయితే మైశయ్య నాలుగు రోజుల క్రితం అదృశ్యమవ్వగా.. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఆదివారం స్థానిక గుట్ట ప్రాంతంలో శవమై కనిపించాడు. మృతునికి డొక్కలో కట్టె గుచ్చినట్లు ఉందని, ఎవరో హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై సుధీర్‌రావు, సిఐ సతీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సావర్‌గావ్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జుక్కల్



మండలంలోని సావర్‌గావ్, సావర్‌గావ్ తాండాలో గ్రామసర్పంచ్ కిషన్ పోవార్ అధ్యక్షతన సీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనారోగ్యంతో ఉన్న వారు, వారితో పాటు గుండెజబ్బులు, క్యాన్సర్, థైరాయిడ్, షుగర్, కొలెస్ట్రాల్, మూత్రపరిక్షలు వంటివి యాభై రకాల వ్యాదులకు సంభందించిన వాటికి ఉచితంగా వైద్య రక్త పరిక్షలు నిర్వహించారు. ఎవైన సమస్యలు ఉన్నాయని రిపోర్ట్‌లో తేలితే జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో ఉన్న అధునాతన ప్రభూత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయడంలో సీఎస్సీ సిబ్బంది సహకరిస్తారని వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంతలో పప్పుదినుసులకు భలే డిమాండ్

నవతెలంగాణ-గాంధారి



సంత నిర్వహిస్తున్న దృశ్యం

గాంధారి మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారాంతపు సంతలో విక్రయించే పప్పు దినుసులకు భలే డిమాండ్ ఏర్పడింది. గాంధారి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి పప్పు దినుసులు కొనుగోలు చేస్తున్నారు. బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం తదితర మండలం నుంచి వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇక్కడ విక్రయించే పప్పు దినుసులు నాణ్యంగా ఉండడంతో డిమాండ్ ఏర్పడిందని వ్యాపారస్తులు కొనుగోలుదారులు పేర్కొంటున్నారు.

జైపాల్‌రెడ్డి వస్తే అడ్డుకుంటాం

- బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

జహీరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ టికెట్ రేస్‌లో ఉన్న జైపాల్ రెడ్డి గాంధారికి వస్తే అడ్డుకుంటామని గాంధారి మండల బీజేపీ నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిజెపి మండల అధ్యక్షులు సాయిబాబా మాట్లాడుతూ.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గవంపై దృష్టి సారించి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థుల జాబితా నుండి జైపాల్‌రెడ్డిని తప్పించాలని చేశారు. ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ బిజెపి సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలను పక్కకు పెట్టి కాంగ్రెస్ బిఆర్ఎస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ పక్క పార్టీ కార్యకర్తలకు బిజెపి కార్యకర్తలకు మధ్య గొడవలు పెడుతూ రాక్షసానందం పొందుతున్నట్టు ఆరోపించారు. పార్టీ ఎన్నికలు అయిపోయిన తెల్లారి నుండి మల్ల ఎన్నికలు వచ్చేవరకు పార్టీని కాపాడే కార్యకర్తలను పక్కకు పెట్టి కేవలం ఎన్నికల కోసమే పని చేయించుకోవడానికి కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. జైపాల్‌రెడ్డిని పక్కకు పెట్టి పార్టీ కోసం పనిచేసే నాయకునికి జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలనాయకులు జువ్వాడి శ్రీకాంత్, మాణిక్ రావు, ప్రభాకర్ రావు, గంగి రమేష్, సతీష్, వాసు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు వచ్చేది ఎప్పుడో?

- లబ్దిదారుల ఎదురుచూపులు

నవతెలంగాణ-రాజంపేట్



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించినటువంటి గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రస్తుతం ఆగిపోవడంతో లబ్దిదారుల్లో తీవ్రమైన ఆందోళన ఏర్పడింది. మొదటి విడతలో మండలంలో అర్హులైన 177 లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ చేయగా రెండవ విడతలో 171 మంది దరఖాస్తుల చేసుకున్నారు. అయితే 70 యూనిట్ల వరకు మంజూరయ్యాయి. 101 యూనిట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఎనిమిది మంది లబ్ధిదారులు రాయితీ పోను తమ మిగులు సొమ్మును ప్రభుత్వానికి చెల్లించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ గొర్రెల పంపిణీ పథకంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్దిదారులు అయోమయంలో పడిపోయారు. గత ప్రభుత్వంలో రాయితీ పోను మిగిలిన సొమ్ము చెల్లించిన లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎదురుచూపులే వచ్చేది ఎప్పుడో..

ఇప్పటివరకు వాటా మొత్తం చెల్లించిన వారికి గొర్రెలు అందించాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు. నూతనంగా ఏర్పడినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని లబ్దిదారులు వేచి చూస్తున్నారు. లేకుంటే గతంలో ప్రభుత్వ సబ్సిడీ పోను లబ్ధిదారులు చెల్లించినటువంటి సొమ్మును తిరిగి చెల్లించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదేశిస్తే పంపిణీకి సిద్ధం

మండల ప్రభుత్వ వైద్యాధికారి అనిల్



ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. మండలంలో రెండవ విడుతలో 171కి గొర్రెల యూనిట్లకు ఎంపిక కాగా 71మందికి మంజూరయ్యాయి. ప్రస్తుతం 101 మంది పెండింగ్‌లో ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాము.

పోలీసుల వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రం నుండి బాసర వెళ్లే ప్రధాన రహదారిపై ఎస్ఐ యాదగిరి గౌడ్ ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలకు సుమారు 5వేల జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు.

కలాలు.. ప్రజల కలలకు
కాపలాదారులగా నిలవాలి

- కొత్త తరానికి భావజాలం అందించాలి
- తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్

కలాలు.. ప్రజల కలలకు కావలా దారులుగా నిలవాలని, కొత్త తరానికి భావజాలం అందించాల్సిన అవసరం ఉందనితెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం సిద్దిపేటలోని బివిఎం కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి తెరవే కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు తోడుగా నిలబడే స్పష్టమైన లక్ష్యం కవులకు ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ తట్టుకొని నిలబడే స్థితిలో కలాలు ఉండాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతల సమూహానికి జనయేత్రీ ఫౌండేషన్ సామాజిక సేవా పురస్కారం



సామాజిక సేవా పురస్కారం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ (ఐవిఎఫ్)కు ఉత్తమ సామాజిక సేవ పురస్కారాన్ని అందించింది. జనయేత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తతీయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, కామారెడ్డి రక్తదాతల సమూహ ఫౌండర్ డాక్టర్ బాలు, ఉపాధ్యక్షులు జమీల్ అహ్మద్, డాక్టర్ పుట్ల అనిల్,కిరణ్ కుమార్,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డికి ప్రముఖ సంగీత దర్శకుడు, నిర్మాత, సినీ హీరో ఆర్పి పట్నాయక్ అందజేశారు. 18 వేల యూనిట్లపైగా రక్తాన్ని సేకరించడం, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించడం, కరోనా సమయంలో ప్లాస్మాను, డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వారికి కావలసిన ప్లేట్‌లెట్స్‌ను సకాలంలో అందజేస్తున్నందుకు గాను పురస్కారం అందుకున్నారు.

యువకులకు ఉపాధి కల్పిస్తా

- ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్



పైడి ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న యువకులు

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు సేవకునిగా పనిచేస్తానని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చినటుట తెలిపారు. లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన చత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు ఆదివారం ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త పైడిల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో విగ్రహం ఏర్పాటుకు కషి చేస్తానని యూత్ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు రజనికాంత్‌గౌడ్, సతీష్‌రెడ్డి, సంపత్‌గౌడ్, ముకుంద్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్‌గౌడ్, రాముగౌడ్, భాస్కర్‌రెడ్డి, శివలింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1992-93 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎవరెవరు ఏం చేస్తున్నారో తదితర క్షేమసమాచారాలు ఆరా తీసుకున్నారు. 30 ఏండ్ల తర్వాత ఇంతమంది ఒకే చోట కలవడంతో ఆనందంగా గడిపారు. ఈ సమ్మేళనం లో మోహిద్, నారాయణ, ఆంజనేయులు, సాయులు, విత్య, రాజు, ఆనంద్, మొదలగు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందాలి



మాట్లాడుతున్న డా.బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ గవర్నర్ 3150 జిల్లా గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా ఆదివారం కామారెడ్డి రోటరీ క్లబ్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి అధికారిక పర్యటనలో భాగంగా సందర్శించారు. వివిధ కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలో ప్రతి ఒక్కరికి అందాలని, అంతర్జాతీయంగా రోటరీ క్లబ్ చేస్తున్నటువంటి సేవలను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో ముందుండాలని తద్వారా సమాజంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి రోటరీ సేవలు అందించే విధంగా కృషి చేయాలని సభ్యులకు సూచించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో 112 క్లబ్బులు కొనసాగుతున్నాయన్నానీ, ఈ కమిటీల పదవీకాలం సంవత్సర కాలం కొనసాగుతుందని, జులై 1 నుండి జూన్ 30 వరకు కమిటీలు కొనసాగుతయని అన్నారు. కామారెడ్డి రోటరీ క్లబ్ ఈ ఏడు నెలల కాలంలో 45 కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు పూల బోయిన సత్యం, కార్యదర్శి రాజనర్సింహ రెడ్డి, కోశాధికారి తోర్నాలా సుధాకర్ , శ్రీశైలం, నాగభూషణం, సత్యనారాయణ, ధనంజయ, కాశీనాథ్ రావు, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో ఎక్కిస్తున్నా

- పేదల అభ్యున్నతికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నవతెలంగాణ-సదాశివనగర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పేదల అభివృద్ధికి, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ తెలిపారు. ప్రజలకు ఆహారం మంచి నీరు, ఇల్లు ముఖ్యమైనవని అన్నారు. పాఠశాలలో బాలికలకు మరుగుదొడ్లు ముఖ్యమన్నారు. ప్రతి సమస్యను, చేపట్టాల్సిన పనులను సాఫ్ట్‌వేరులో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ సర్పంచ్ సంగారెడ్డి పూల దండ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 176 మందికి సియంఆర్‌యఫ్ చెక్కులు అందించినట్లు తెలిపారు. 47 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు అందించామని, 49 మందికి అందివ్వనున్నట్లు తెలిపారు. 8.5 లక్షలతో తండాలలో రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం 6 గ్యారెంటీలలో 2 అమలు చేసిందని అన్నారు. ఫిబ్రవరిలో మరో 2 పథకాలు అమలు చేస్తామని అన్నారు. సదాశివనగర్ మండలం ముగ్గురు సర్పంచ్‌లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. బీఆర్‌యస్ ప్రభుత్వం లో దళిత బంధు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నారని కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ వారిపైన ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎవరైనా పేదల వద్ద డబ్బులు తీసుకుంటే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు తమ దృష్టికి తేవాలని అన్నారు. అభ్యవృద్ధి పనులలో ముఖ్యమైన పనులు ముందు పూర్తి చేసుకుందామని తెలిపారు. తహశీల్దార్ ఆర్ హిమబిందు కల్యాణ లక్ష్మీ పనులు వేగవంతంగా చేసినట్టు అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, సింగిల్ విండో చైర్మన్ గంగా దర్, సంపత్ గౌడ్, డైరెక్టర్ బత్తుల రాములు, ఎంపిఒ నరేందర్‌రెడ్డి, రైతు నాయకుడు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివద్ధికి కృషి చేయాలి

రామారెడ్డి : మండలంలోని గోకుల్ తాండ అభివద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్మోహన్‌రావును కాంగ్రెస్ నాయకులు కోరారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్‌లో అభివద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్మోహన్‌రావును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండా అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివద్ధిలో తోడ్పడాలని ఎమ్మెల్యేను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తాండ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొడిచర్ల రైతు వేదిక ప్రారంభోత్సవం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో నిర్మించిన రైతు వేదికను నేడు(సోమవారం) ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించనున్నట్టు సంతోష్ పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల రైతు సోదరులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఎమ్మెల్యేతో పాటు మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, ఎంపీటీసీ సభ్యురాలు రాధాబాయి హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు వేదిక ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖ అధికారులు హాజరుకావాలని కోరారు.

మండల వ్యాప్తంగా 25 నర్సరీలు ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలం వ్యాప్తంగా 25 నర్సరీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రఘు తెలిపారు. ఒక్కో గ్రామపంచాయతీ పరిధిలో పదివేల మొక్కలు చొప్పున పెంచి నాటించే ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జూన్ నెల నాటికి నర్సరీలలో మొక్కలు ఎదిగే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై పంచాయతీ కార్యదర్శిల పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం నర్సరీలలో విత్తనాలు నాటినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల హామీలను
100 రోజుల్లో అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న పశ్యపద్మ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను 100 రోజుల్లో అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు వి ఎల్ నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చినటువంటి వందరోజుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వము వెంటనే అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో పలువురు నాయకులు అవినీతికి పాల్పడ్డారని, భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ గత ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు నిరుపేదల భూములను ధరణిలోని లొసుగులను ఉపయోగించి తమ పేర్లపైకి మార్చించుకున్నారని, అమాయక ప్రజలను హింసించి వారి భూములు లాక్కున్నారని అన్నారు. ఇప్పటికైనా వారు కబ్జా చేసిన భూములను అర్హులైన వారికి ఇవ్వాలని, ధరణి వెబ్సైట్‌ను ఎత్తివేయాలని అన్నారు. బిజెపి ప్రభుత్వము పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా రాముడు అయోధ్య పేరుతో మతం పేరుతో యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని అన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని, ఎల్ఐసి, రైల్వే, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ రంగాలను కార్పొరేట్లకు అప్పగిస్తూ.. మరో వైపు ఈ అంశాలను ఎవరూ ప్రశ్నించకుండా అయోధ్య రామ మందిరం పేరు తీసుకొచ్చి యువకులను ఎన్నికల హామీలు మర్చిపోయేలా ప్రచారం చేస్తున్నారని అన్నారు.

కామారెడ్డిలో ప్రధానంగా బతుకమ్మ కుంట, టీచర్స్ కాలనీ, చర్చి, 20, 21, 22 వార్డులలో నిరుపేదల భూములను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల పైన చర్య తీసుకోవాలని, గతంలో అనేకసార్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్, అయినా కాంగ్రెస్ అయినా ఏ పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నా వారి పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు.

ఈనెల 25వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ ఇంటిపై దాడి చేసిన కౌన్సిలర్ తమ్ముడు తేజ ప్రదీప్, రమ్య, ఉష, అనూష గుర్తుతెలియని 20 మంది యువకులపై పోలీసులు ఇప్పటివరకు వారి పైన ఎలాంటి కేసులు నమోదు చేయలేరని అన్నారు. వీరి వెనుక ఉన్న ప్రముఖ రాజకీయ పార్టీ నాయకులు చట్టాలను చుట్టాలుగా చేసుకుని ఉండడంతో పోలీసు అధికారులు వారిని అరెస్టు చేయలేదని అన్నారు. అరెస్టు చేయకుంటే పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి ఎల్ దశరథ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర నరసింహులు, దేవయ్య, నాగిరెడ్డి, పుష్పలత, శ్యామల, ఈశ్వర్, మల్లేష్, మమత, లక్ష్మి, సాయిలు, హనుమాన్లు, బసవయ్య, రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివప్రసాద్, సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | జనవరి 29, 2024 | www.navatelangana.com

రాముడికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఇస్కాన్ ద్వారకనగర్ ఆధ్వర్యంలో కేజీ దాస్ ప్రభు ఇంట్లో ఆదివారం రాముడి పుష్పాభిషేకం, రాముడి విశిష్టతను సుందర రూప దాస్ భక్తులకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం నేటితో ప్రారంభమైందని, ప్రపంచంలోని అన్ని ఇస్కాన్ దేవాలయాల్లో రామునికి పుష్పాభిషేకం జరుపుతున్నారని వివరించారు. అలాగే దీపారాధన, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సుధాకర్ భక్త్, కేజీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు స్వప్న ఎంపిక



స్వప్నను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థిని స్వప్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం తెలిపారు. గత నెలలో సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించే 29 నుంచి 1వరకు జరగబోయే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని అమె తెలిపారు. విద్యార్థిని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పిఈటీ జోష్ణ, హౌస్ టీచర్స్ చెన్నకేశ్వరి అభినందించారు.

ఎస్ఎఫ్ఐ గర్ల్స్ సబ్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎఫ్ఐ గర్ల్స్ సబ్ కమిటీని ఎన్నుకున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక తెలిపారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో గల మల్లుస్వరాజ్యం ట్రస్ట్ భవనంలో ఎస్ఎఫ్ఐ నగర గర్ల్స్ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గర్ల్స్ కమిటీ రాష్ట్ర సభ్యురాలు దీపిక మాట్లాడుతూ.. విద్యార్థినులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించే రకంగా ప్రభుత్వం చూడాలని నగరంలో గర్ల్స్ కాలేజ్ గర్ల్స్ స్కూళ్ల వద్ద ప్రొటెక్షన్‌గా షీటీంలు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్, అదే విధంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మెటిక్ చార్జీలను విడుదల చేయాలని అన్నారు. ప్రత్యేకంగా సంక్షేమ హాస్టల్లో అమ్మాయిలకు శానిటరీ నాప్కిన్స్ అందించే విధంగా ఈ ప్రభుత్వ హయాంలో చూడాలని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఇదే..

గర్ల్స్ కన్వీనర్‌గా సుమిత్ర, కో కన్వీనర్‌గా సమ్రీన్ బేగం, కన్వినింగ్ కమిటీ సభ్యులుగా మేఘన, వీణ, చిన్ని, పద్మ, వైష్ణవి, లతను ఎన్నుకున్నారు.

తెలంగాణ బిసి కులాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్



నియామకపత్రాన్ని అందుకుంటున్న శివకుమార్

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా బోధన్ పట్టణానికి చెందిన శివకుమార్ నియమితులయ్యారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన శివకుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్ ప్రకటించారని శివకుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికై కృషి చేస్తానని, అన్ని కులసంఘాల మద్దతుతో బిసి కులాలకు జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పి బిసి కులాల సంక్షేమానికై కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర జనాభా అత్యధికంగా ఉన్న బిసి వర్గం అన్ని విషయాల్లో వెనుకబడుతుందని చెప్పారు.

బోధన్ రూరల్ సిఐ బదిలీ



నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ సిఐగా పనిచేస్తున్న శ్రీనివాసరాజ్‌ను సి.సి.ఆర్.బీ విభాగానికి బదిలీ చేస్తూ సిపి కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత సంవత్సరంనరకు పైగా బోధన్ రూరల్ సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసరాజ్ శాంతిభద్రతల పరిరక్షణలో తన వంతు పాత్ర పోషించారు. వివాదరహితుడిగా పేరుపొందిన శ్రీనివాస్ రాజ్ పోలీసు సిబ్బందితో మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. శ్రీనివాసరాజ్ నిజామాబాద్ సిసిఎస్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జైనాథ్ రూరల్ సిఐగా పనిచేస్తున్న కోలా నరేష్‌ను బదిలీ చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పలు గ్రామాల్లో జీపీ భవనాలను ప్రారంభించనున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బండారుపల్లి, సంగెం గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను సోమవారం బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు చంద్రకళ, అంజవ్వ ఆదివారం తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ ద్వారా మంజూరైన 20 లక్షల రూపాయలతో నూతన గ్రామపంచాయతీ భవనాలు నిర్మించినట్టు వారు తెలిపారు. బండారుపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీ భవనం లేకపోవడంతో ఇరుకైన గదిలో కార్యలయం ఏర్పాటు చేశారని, దాంతో పాలనపరంగా ప్రజలకు ఇబ్బందులు కలగడంతో ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవనం కోసం నిధులు మంజూరి చేయడంతో భవన నిర్మాణం పూర్తిచేసినట్టు వివరించారు.

నేడు లహరి బస్సును ప్రారంభించనున్న ఎమ్మెల్యే

బోధన్ డిపోలో నూతనంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం అందించిన లహరి బస్సును బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, ఏసిపి కిరణ్ కుమార్, ఆర్‌డిఓ రాజాగౌడ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ హాజరవుతారని ఆయన తెలిపారు.

కులబహిష్కరణపై 11 మంది మొటాడి రెడ్డిలపై కేసు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల బహిష్కరణలో నగరంలోని బోర్గాం(పీ)లో గల మోటారెడ్డిసంఘంలోని 11 మంది సభ్యులపై కేసు నమోదు చేసినట్టు నాలుగవ స్టేషన్ ఎస్ఐ సంజీవ్ ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈగ గంగారెడ్డి అనే వ్యక్తికి తన కుటుంబీకులతో భూ సమస్య కొనసాతుండగా.. మొటాడిరెడ్డి సంఘం సభ్యులు మధ్యలోకి వచ్చి తమకు 100 సార్లు క్షమాపణలు చెప్పాలని, ముక్కు నేలకురాయాలని లేకుంటే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించినట్టు ఫిర్యాదు చేశాడు. అలా చేయకపోవడంతో తనను కుల బహిష్కరణ చేసినట్టు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వైస్‌చైర్మన్‌ను చైర్మన్‌గా కొనసాగించాలి

- పట్టణంలో మైనారిటీ కౌన్సిలర్ల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న మైనారిటీ కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ వైస్ చైర్మన్‌ను ఇన్చార్జి చైర్మన్‌గా నియమించాలని కోరుతూ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు జహీర్ అలీ, ఫయాజ్, సయ్యద్ అతిక్, అబ్దుల్ రెహమాన్ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం వైస్ చైర్మన్, మైనార్టీ కౌన్సిలర్లు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినందున తిరిగి బలపరీక్ష చేపట్టే వరకు వైస్ చైర్మన్ షేక్ మున్నును ఇన్చార్జి చైర్మన్‌గా నియమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ ఇన్చార్జి చైర్మన్‌ను నియమించడం లేదన్నారు. ముస్లిం మైనార్టీ వైస్ చైర్మన్‌గా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం నియమించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ తీరు ఇదేవిధంగా కొనసాగితే వచ్చే లోక్‌సభ ఎన్నికలలో ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ముస్లిం, మైనార్టీలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నశించాలని డిమాండ్ చేశారు. తప్పుడు నివేదికలను పంపిన జిల్లా కలెక్టర్, ఆర్డీవోను సస్పెండ్ చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి వైస్ చైర్మన్ మున్నాకు ఇన్చార్జి చైర్మన్‌గా నియమించాలని వారు కోరారు. ఈ దీక్షలో నాయకులు షేక్ బాబు, ఖయ్యూం, హర్షద్, షేక్ చోటు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటించిన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్



పట్టణంలో పర్యటించిన డిస్ట్రిక్ గవర్నర్

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ బుశిరెడ్డి శంకర్‌రెడ్డి అధికార పర్యటనలో భాగంగా ఆదివారం సందర్శించారు. వారికి అధ్యక్షులు గోపీకృష్ణ సభ్యులతో కలిసి సిద్దుల గుట్ట వద్ద పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. తర్వాత పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్టను సందర్శించారు. అనంతరం రోటరీ సేవలో భాగంగా రోటరీ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని జర్నలిస్ట్ కాలనీలో ప్రారంభించి మహిళలందరికీ ఈ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో కుర్చీల వితరణ, టేబుల్స్ వితరణ చేశారు. అనంతరం రోటరీ క్లబ్ పబ్లిక్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సేవలు ఆదర్శమని వీరు ముఖ్యంగా విద్య, వైద్య రంగానికి సేవలు అందిస్తున్నారని వారి సేవలు అభినందనీయమని అన్నారు. గ్లోబల్ నిధుల నుంచి రూ.25 లక్షలు ఇవ్వడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారి సేవలు ఆదర్శమని నేటి యువతరం, వచ్చే నూతన సభ్యులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతానికి విస్తరించాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ, కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ మాజీ అధ్యక్షులు పుష్పకరావు, విజయసారథి, రాజ్‌కుమార్ అగర్వాల్, లింగగౌడ్, గంగమోహన్ చక్రు, ఎలెక్ట్ అధ్యక్షులు రజనీష్ కిరడ్, కాంతి గంగారెడ్డి, ఎం.కే.నరేందర్, రోటరీ సభ్యులు గోనే దామోదర్, లింబాద్రిగౌడ్, రాస ఆనంద్, శశిధర్, సందీప్, వాసు, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- అవిశ్వాసాన్ని ప్రోత్సహిస్తే గుణపాఠం తప్పదు
- ఎంపీపీ గద్దె భూమన్న

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని నియోజకవర్గం ప్రజలు ఎన్నుకుంటే అభివృద్ధిని మరిచి అధికారంలో ఉన్న బీసీ వర్గంలోని (పద్మశాలి) నాయకులను అగణదొక్కాలని, అవిశ్వాసాలను ప్రోత్సహిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమయ్య (శ్రీనివాస్) నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఉన్న కొందరు ఎంపీటీసీలు ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరి ఈ నెల12న తనపై అవిశ్వాస తీర్మాణానికి నోటీసు ఇచ్చారని తెలిపారు. దానిలో భాగంగానే ఈ నెల 29న అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే తాను ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా సమావేశాన్ని నిర్వహించవద్దని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని ఎంపీపీ భూమన్న తెలిపారు. తాను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, తను పాల్పడినట్లు నడిపల్లి-2 ఎంపీటీసీ నర్సయ్య తనపై అవిశ్వాస నోటీసు అందజేయడంతో పాటు తాను ముందస్తు స్టే ఆర్డర్ తెచ్చుకోవద్దని మూడు కోర్టులలో కేవియట్ దాఖలు చేశారని, దానిలో అక్రమాలకు పాల్పడ్డానని అయన ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేశానని, రాష్ట్రం నుంచి ఎలాంటి నిధులు రాలేదన్నారు. అయితే తాను ఇప్పటి వరకు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, నీతి నిజాయితీగా భాధ్యతలు చేపట్టనని, గత నాలుగేళ్లుగా పలువురు ఎంపిడిఓలను మార్చారని, తనకు చెక్‌పవర్ లేనేలేదని, అలాంటప్పుడు అక్రమాలకు తావులేకుండా ఉంటుందన్నారు. ఎలాంటి అక్రమాలు లేవనే ఉద్దేశంతోనే హైకోర్టు తనకు స్టేఆర్డర్ మంజూరు చేసిందన్నారు. ఆర్డీవోకు నోటీసులు ఇచ్చే అధికారం లేకున్నా అవిశ్వాస సమావేశంపై ఎంపీటీసీలకు నోటీసులు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చిల్లర రాజకీయాలు చేయకుండా హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కొందరు వెనుక ఉండి నడిపిస్తూ సొసైటీ చైర్మెన్లను, డైరక్టర్లపై అవిశ్వాస తీర్మానాలను ప్రోత్సహించడం మానుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కొట్లాడి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తేచ్చి రూరల్‌ను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం, ధర్మం గెలిచిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ ఎంబడి సంతోషం, బిజెవైఎం జిల్లా కార్యదర్శి పానుగంటి సతీష్‌రెడ్డి, నాయకులు చౌకి లక్ష్మన్, ప్రతాప్, బాలయ్య, చరణ్, విష్ణు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె భూమన్న

గ్రామభివృద్ధే నా ధ్యేయం



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-సిరికొండ

గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన ధ్యేయం అని దూప్య తాండ సర్పంచ్ పద్మ మదన్ అన్నారు. ఆదివారం ఆ గ్రామ పంచాయతీ పరిధిలో 31 మంది వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న నేపథ్యంలో వారిని ఘనంగా సన్మానించినట్టు తెలిపారు. తన గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి జరిపించాలని తనకు గ్రామస్తులు ఎల్లవేళలా తోడుండాలని అన్నారు.

టిపిటిఎఫ్ విద్యా మహాసభలను విజయవంతం చేయండి

- జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగే టిపిటిఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయలని జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ ఉపాధ్యాయులను కోరారు. ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మంలో జరిగే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలకు జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, విద్యాభిమానులు, విద్యావేత్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. 1944 నుంచి ఫెడరేషన్ విద్యావ్యాప్తికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యా సంబంధ కార్యక్రమాలపై అనేక చర్చలు, తీర్మానాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలను, ఉపాధ్యాయుల సంక్షేమంపై చర్చ ఉంటుందన్నారు. ఈ సభలలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, మేధావులైన ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, బుర్ర రమేష్, ప్రొఫెసర్ కాశీం, వేణుగోపాల్, ఎ.నరసింహారెడ్డి, విమలక్క, పిడమ్మిడి సంధ్యతో పాటు అనేకమంది మేధావులు, విద్యావేత్తలు ఉపాధ్యాయులు పాల్గొంటారని, కావున జిల్లాలోని ఉపాధ్యాయులు మేధావులు, విద్యావేత్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అరవింద్ చందర్, మల్లేశం, గోపి, లింగయ్య, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ బహిరంగసభను జయప్రదం చేయాలి

- జిల్లా కార్యదర్శి సుధాకర్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

ఫిబ్రవరి 4న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2,3,4 తేదీలలో హైదరాబాద్ మగ్దూం భవన్లో నిర్వహించే సిపిఐ జాతీయ సమితి సమావేశాలు నిర్వహించనున్నామని, ఈ సమావేశాలకు సిపిఐ ఆయా రాష్ట్రాల్లో ఉన్న జాతీయ నాయకులతో పాటు సిపిఐ పార్టీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారని తెలిపారు. ఈ సమావేశాలలో భవిష్యత్తులో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు, దేశంలో బిజెపి నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్టు వివరించారు. సమావేశంలో సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, సిపిఐ మండల కార్యదర్శి ఎ.విటల్‌గౌడ్, సిపిఐ మండల నాయకులు బర్ల సునీల్ కుమార్ పాల్గొన్నారు.

లేడీస్ టైలర్ నిర్వాహకురాలిపై దాడి

- తీవ్ర గాయాలు



దాడిచేస్తున్న మహిళ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో లేడీస్ టైలర్ దుకాణం నిర్వహిస్తున్న జయశ్రీ అనే మహిళపై మరో లేడీస్ టైలర్ దుకాణం నిర్వహిస్తున్న మహిళ దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితురాలు జయశ్రీ తెలిపారు. తాను గతంలో తనపై దాడిచేసిన మహిళ లేడీస్ టైలర్ దుకాణంలో పనిచేసినట్లు తెలిపారు. కాని కొన్ని రోజుల తర్వాత కలిసి రాకపోవడంతో తాను వేరే దుకాణం పెట్టుకున్నట్లు జయశ్రీ తెలిపారు. ఈ క్రమంలో శనివారం తాను పనిచేసిన లేడీస్ టైలర్ దుకాణం యజమానురాలు తన ఎదుగుదలను ఓర్వలేక ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి తన దుకాణంలో తనపై అన్యాయంగా దాడి చేసిందని తెలిపారు. ఈ దాడిలో తనకు చేతుకు, శరీరంపై కత్తెరతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితురాలు జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మహాలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బోనాలు తీస్తున్న గ్రామ ప్రజలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్ గ్రామంలో మహాలక్ష్మి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మోటాటిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఓడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుడి ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అర్కల నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, కేశ్‌పల్లి గంగారెడ్డి, అంగల్ ఉదయ్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సీఐగా కె.మల్లేష్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి సీఐగా కె.మల్లేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన కృష్ణ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిర్మల్ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న మల్లేష్ డిచ్‌పల్లికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి పోలీసులను సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని సూచించారు. నూతన సీఐకి డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్‌వాయి ఎస్ఐలు యు.మహేష్, తిరుపతి, ఎస్.మహేష్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేటి ఛలో కలెక్టరేట్ వాయిదా

- ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కమిటీగా నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ తెలిపారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడ అనిల్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ప్రజాసంఘాలుగా లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సభ ఉండడంతో సోమవారం నిర్వహించే జిల్లా కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరో తేదీని ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు వాగ్మారే విశాల్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి.దీపిక, నగర ఉపాధ్యక్షులు సందీప్, గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ సభ్యులు మేఘన, సుమిత్ర, వీణ తదితరులు పాల్గొన్నారు.